RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 281 | పబ్లిషర్ : కొక్కురవికుమార్ | శుక్రవారం 28 - 8 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

## మోడీకి ఖర్గే లేఖ.. డీలిమేటేషన్‌పై 3 డిమాండ్లు

**న్యూఢిల్లీ,ఆగస్టు 27:**దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే నియోజకవర్గాల పునర్విభజన వంటి సున్నితమైన అంశంపై ప్రభుత్వం ఏకపక్షంగా ముందడుగు వేయకూడదని ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లును బలవంతంగా తీసుకురావొద్దని నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

## నేపాల్ వరదలపై తెలంగాణ ప్రభుత్వం అలర్ట్.. సీఎం రేవంత్ ఆదేశాలతో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు

**హైదరాబాద్,ఆగస్టు 27:**నేపాల్‌లో వరదలకు సంబంధించిన దృశ్యాలు చూస్తేనే షాక్ అయ్యే పరిస్థితి.. భారీ ఆస్తినష్టంతో పాటు.. పెద్ద ఎత్తున ప్రాణనష్టం కూడా జరిగింది.. ఇక ఎంతో మంది గల్లంతు అయ్యారు.. అయితే, నేపాల్‌లో భారీ వరదల కారణంగా చిక్కుకుపోయిన లేదా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ వాసులకు సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తెలంగాణకు చెందిన యాత్రి కులు, పర్యాటకులు, ఇతర వ్యక్తులకు అవసరమైన సహాయం అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## హనుమకొండలో హైటెన్షన్..

# ధర్నా తర్వాత హరీశ్ రావు అరెస్ట్..

### ఉద్యోగులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు-బెదిరింపులకు ఉద్యోగులు లొంగరు-అసెంబ్లీలో సర్కారును నిలదీస్తాం:మాజీ మంత్రి హరీశ్



హనుమకొండ:హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణం గురువారం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎన్జీవోలు చేపట్టిన ధర్నా ఆందోళనలో బీఆర్ఎస్ అగ్రనేతలు పాలుపంచుకుని ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ క్రమంలో ధర్నా ముగిసిన అనంతరం కలెక్టరేట్ నుండి పాలిటెక్నిక్ కాలేజీ వైపు బయలుదేరిన మాజీ మంత్రి హరీశ్ రావును పోలీసులు అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు , మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని ఉద్యోగ వర్గాలకు అండగా ఉంటామని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లన్నిటికీ బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడిన హరీశ్ రావు కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టారు.రేవంత్ రెడ్డి పాలనపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ప్రభుత్వంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందాలంటే 15 శాతం కమిషన్లు ఇచ్చుకోవాల్సిన దారుణమైన పరిస్థితి నెలకొందని ఆయన ఆరోపించారు. ఉద్యోగులకు వెంటనే మెరుగైన పీఆర్సీ (గా=జ) ప్రకటించాలని, అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'ప్రజా పాలన' అని చెప్పుకుంటున్న ఈ సర్కారులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలవడానికి వెళ్తే కనీసం సెల్ ఫోన్‌ను కూడా అనుమతించడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు , విద్యార్థులు ప్రతి ఒక్కరూ తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి వచ్చిందని, అయినా సర్కారుకు చలనం లేదని విమర్శించారు. ఉద్యోగ సంఘాల నాయకులను బెదిరించేందుకు ఏసీబీ, విజిలెన్స్ కేసులను బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కొందరు నాయకులను బెదిరించవచ్చేమో కానీ, లక్షలాది మంది ఉన్న ఉద్యోగుల పవర్ ముందు ఈ బెదిరింపులు సాగవని హెచ్చరించారు. ఉద్యోగులతో పెట్టుకుని ఎవరూ సంతోషంగా ఉన్న చరిత్ర లేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా రోజులు దగ్గర పడ్డాయని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగుల గొంతుకగా మారి బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని, ఉద్యోగుల డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## జీవో 97పై బీజేపీ ఫైర్..

# విద్యార్థులకు అండగా కిషన్ రెడ్డి.!



**హైదరాబాద్,ఆగస్టు 27:**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నడుపుతున్నది ప్రజా పాలన కాదు, పోలీసుల నిర్బంధ పాలన అని స్పష్టమవుతోంది. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల దాకా విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా రోడ్డెక్కితే.. వారిపై లాఠీఛార్జీలు చేయించడం, అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను.రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న మా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారితో పాటు పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయించడం కాంగ్రెస్ పిరికితనానికి నిదర్శనం. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థుల హక్కులను కాలరాస్తుంటే ఎందుకు కనిపించడం లేదు?పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థులకు ఉన్నత విద్య (ఈసెట్) అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే విరమించుకోవాలి. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయకుండా వివాదాస్పద జీవో 97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలి. తెలంగాణ విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి చివరిదాకా రాజీలేని పోరాటం చేస్తుంది.

## భారత్, చైనాలపై నేపాల్ మంత్రి ఆసక్తికర పోలిక..

# రెండూ ముఖ్యమేనని స్పష్టం



**న్యూఢిల్లీ,ఆగస్టు 27:**భారత్, చైనాలతో తమ దేశ సంబంధాలపై నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తల్లి స్థానాన్ని తండ్రి, తండ్రి స్థానాన్ని తల్లి భర్తీ చేయలేరని, ఈ రెండు దేశాలతో తమకు ఉన్న అనుబంధం అటువంటిదేనని ఆయన పేర్కొన్నారు. ఖాట్మండులో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో భారత్, చైనాలతో సమతుల్య దౌత్యంపై ఎదురైన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. నేపాల్‌ను చైనా తన గుప్పిట్లోకి తీసుకుందంటూ భారత మీడియాలో వస్తున్న కథనాలను ఆయన తోసిపుచ్చారు. తమ విదేశాంగ విధానం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, కేవలం దేశ ప్రయోజనాల ప్రాతిపదికన ఉంటుందని స్పష్టం చేశారు. నేపాల్ మొత్తం వాణిజ్యంలో మూడింట రెండొంతులు వాటా కేవలం భారత్‌తోనే జరుగుతోందని, ఈ విషయంలో మరో దేశం దరిదాపుల్లో కూడా లేదని ఆయన గుర్తుచేశారు. చైనా ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ఒప్పందంపై కూడా ఆయన కీలక విషయాలు వెల్లడించారు. 2017లో ఒప్పందం కుదిరినప్పటికీ, గత పదేళ్లలో బీఆర్ఐ ప్రాజెక్టుల కింద తమకు ఒక్క డాలర్ నిధులు కూడా అందలేదని స్పష్టం చేశారు. నేపాల్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, ఇంధనం, పర్యాటకం, సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో భారత కంపెనీలు ముందుకు రావాలని ఆయన ఆహ్వానించారు. ఈ మేరకు ఎన్డీటీవీ తన కథనంలో పేర్కొంది.

# జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల ధ్వంసం

### పోలవరం పనులను జగన్ నిర్లక్ష్యం చేశారన్న అచ్చెన్నాయుడు



**అమరావతి,ఆగస్టు 27:**వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పోలవరం పనులను నిర్లక్ష్యం చేయకుండా కొనసాగించి ఉంటే రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులు వచ్చినా రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని వ్యాఖ్యానించారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హంద్రీనీవా ప్రాజెక్టుపై 16 నెలల్లోనే రూ.3,500 కోట్లు ఖర్చు చేసి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందించామని అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 74 శాతం మేర పూర్తయిన పోలవరం ప్రాజెక్ట్‌ను వైసీపీ ప్రభుత్వం రాగానే ఒక ఏడాది పాటు నిరంతరాయంగా పూర్తి చేసి ఉంటే ఇక్కట్లన్నీ తీరేవని, కానీ ఆ ప్రాజెక్టును గోదావరి వరదల్లో ముంచేసి నాశనం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం తిరిగి పోలవరాన్ని గాడిలో పెట్టిందని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే, 1995లో వెలిగొండ ప్రాజెక్ట్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారని... ఇప్పుడు ప్రాజెక్ట్‌ను ఆయనే పూర్తి చేసి, జాతికి అంకితం చేయబోతున్నారని చెప్పారు. గతంలో తొండలు కూడా గుడ్లు పెట్టని రాతి నేలల్లో వెలిగొండను నిర్మించామని, పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు త్వరలోనే ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని తాకబోతున్నాయని వెల్లడించారు.

## మోహన్ భగవత్ వీసా రద్దు చేయండి:

# అమెరికా ప్రభుత్వానికి కీలక కమిషన్ సూచన



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్‌సంఘచాలక్ మోహన్ భగవత్ అమెరికా పర్యటనలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆయన వీసాను తక్షణమే రద్దు చేయాలని, ఆర్ఎస్ఎస్‌పై నిర్దిష్ట ఆంక్షలు విధించాలని యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) అమెరికా ప్రభుత్వాన్ని కోరింది. భగవత్ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న తరుణంలో ఈ సిఫార్సు వెలువడటం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌లో క్రైస్తవులు, దళితులు, ముస్లింలు, సిక్కులతో సహా మతపరమైన మైనారిటీలపై ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు హింసాత్మక దాడులకు పాల్పడుతున్నాయని ఈ సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ హిందుత్వ సిద్ధాంతాలకు అనుగుణంగా విధానాలను అమలు చేస్తోందని, ఇవి మైనారిటీల పట్ల వివక్షాపూరితంగా ఉన్నాయని ఆరోపించింది. భారత్‌లో మత స్వేచ్ఛ క్షీణిస్తోందని, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని హింసాత్మక, రెచ్చగొట్టే చర్యలు జరుగుతున్నాయని యూఎస్‌సీఐఆర్ఎఫ్ చైర్మన్ ఆసిఫ్ మహమూద్ పేర్కొన్నారు. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు, భారత అధికారులపై లక్షిత ఆంక్షలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు. భగవత్ వీసాను రద్దు చేయడమే కాకుండా, భవిష్యత్తులో ఆయన అమెరికాలో ప్రవేశించకుండా అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. గోరక్షకుల దాడులు, మత మార్పిడి నిరోధక చట్టాలు, ఎన్ఆర్సీ, సీఏఏ వంటి అంశాలను కూడా కమిషన్ ప్రస్తావించింది. ఉత్తర అమెరికాలోని సిక్కులపై జరిగిన హత్యాప్రయత్నాల వెనుక భారత ప్రభుత్వం హస్తం ఉందని ఆరోపించింది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న మోహన్ భగవత్, న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో నిర్వహించ తలపెట్టిన ఒక కార్యక్రమంలో ప్రసంగించాల్సి ఉంది.

# పార్లమెంట్‌ను నవ్వులపాలు చేస్తున్నారు..

### డీలిమిటేషన్, 'ఒకే దేశం-ఒకే ఎన్నికల'పై చిదంబరం ధ్వజం



**న్యూఢిల్లీ,ఆగస్టు 27:**పార్లమెంట్ పనితీరు, కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు చిదంబరం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వర్షాకాల సమావేశాల్లో సరైన చర్చలు లేకుండానే బిల్లులను ఆమోదించుకున్నారని ఆయన ఆరోపించారు. రోజురోజుకూ పార్లమెంట్‌ను గేలి చేస్తూ, నవ్వులపాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు అసెంబ్లీలో జరుగుతున్న చర్చలను చూస్తుంటే.. ఎంపీగా ఉండటం కన్నా ఎమ్మెల్యేగా ఉండటమే మేలనిపిస్తోందని వ్యాఖ్యానించారు. తమిళనాడు అసెంబ్లీలో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణలను ప్రస్తావిస్తూ కేంద్రంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సామాజిక సేవ చేసే క్రైస్తవ, ముస్లిం సంస్థలను లక్ష్యంగా చేసుకుని... వారి నిధులు, ఆస్తులను లాక్కునేందుకే ఈ చట్ట సవరణను తీసుకొస్తున్నారని విమర్శించారు. ఒక ప్రభుత్వం ఈ రకంగా ప్రజల లేదా సంస్థల ఆస్తులను దోచుకోకూడదని, ఇది అత్యంత దారుణమైన చట్టాలలో ఒకటిగా నిలుస్తుందని మండిపడ్డారు. అలాగే జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ అన్యాయమైన చర్యను దక్షిణాది రాష్ట్రాల పార్టీలతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్ పార్టీలు కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 'ఒకే దేశం – ఒకే ఎన్నికలు' ప్రతిపాదన భారత రాజ్యాంగ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని, ఇది ప్రస్తుతం ఉన్న ఎన్నికల విధానాన్ని పూర్తిగా చిన్నభిన్నం చేస్తుందని వ్యాఖ్యానించారు.

# రాఖీ పండుగ రోజున చెట్లకు రక్షాబంధన్..



రక్షాబంధన్ పండుగ స్ఫూర్తితో ఝార్ఖండ్ అటవీ శాఖ రాష్ట్రంలో వృక్ష సంరక్షణ కోసం ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'చెట్లను కాపాడండి' పేరిట నెల రోజుల పాటు సాగనున్న ఈ ప్రచారంలో భాగంగా సుమారు మూడు లక్షల చెట్లను సంరక్షించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రకృతితో మానవాళికి గల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ ప్రచారంలో భాగంగా, రక్షాబంధన్ పర్వదినమైన శుక్రవారం (2026 ఆగస్టు 28) నాడు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 700 గ్రామాల్లో వేలాది మంది ప్రజలు లక్ష చెట్లకు రాఖీలు కట్టి, వాటి సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయనున్నారు. గుమ్లా జిల్లాలోని జోరద్ గ్రామంలో రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సంజీవ్ కుమార్ స్వయంగా ఒక వృక్షానికి రాఖీ కట్టి, ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ వినూత్న ఆలోచనకు 2004లోనే పునాది పడింది. అప్పట్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ధన్‌బాద్ జిల్లాలోని లుకైయా గ్రామంలో సంజీవ్ కుమార్ ఈ కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. ఆయన చొరవతో అప్పట్లో గ్రామస్థులు 20,000కు పైగా మహువా (విప్ప) చెట్లను సంరక్షించుకున్నారు. తద్వారా లభించే అటవీ ఉత్పత్తులే నేడు వారి జీవనోపాధికి ప్రధాన వనరుగా మారాయి. అదే స్ఫూర్తితో సాగుతున్న ఈ ఉద్యమం నేడు రాష్ట్రవ్యాప్తంగా 12,000కు పైగా గ్రామాలకు విస్తరించడం విశేషం. అటవీ సంరక్షణ, జల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రజల ఆదాయ మార్గాలను మెరుగుపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. 'ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా' గణాంకాల ప్రకారం, ఇటువంటి నిర్మాణాత్మక కార్యక్రమాల ఫలితంగా జార్ఖండ్‌లో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 2001లో 22,637 చదరపు కిలోమీటర్లుగా ఉన్న అటవీ ప్రాంతం, 2023 నాటికి 23,765.78 చదరపు కిలోమీటర్లకు చేరుకోవడం గమనార్హం.

# కాన్పూర్‌లో కూలిన విమానం.. ఇద్దరు పైలట్లు మృతి

**లక్నో,ఆగస్టు 27:** ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక ట్విన్ ఇంజిన్ శిక్షణ విమానం గంగా నది సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న పైలట్, కో-పైలట్ ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.శిక్షణలో భాగంగా గగనతలానికి ఎగిరిన ఈ విమానం, కొద్దిసేపటికే సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో నియంత్రణ కోల్పోయి నేరుగా పొలాల్లో కూలిపోయినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన పైలట్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబాలకు ఈ తీరని లోటును భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, ప్రమాద కారణాలపై అధికారులు ఇప్పటికే సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

# సంపాదకీయం

## ఇది ఉద్వేగం కాదు.. మనిషిలో దాగిన క్రూరత్వం!

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు కేవలం చట్టపరమైన సమస్యలు మాత్రమే కావు. ఈ నేరాల వెనుక దాగి ఉన్న క్రూర మనస్తత్వం, సామాజిక వైఫల్యాలు, నైతిక సంక్షోభం గురించి విశ్లేషించే కథనం. చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, వాటి తర్వాత వెలుగులోకి వస్తున్న అమానుష హింస, హత్యలు సమాజాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి. ప్రతి సంఘటన తర్వాత ఒకే రకమైన ఆవేదన వ్యక్తమవుతోంది. కొవ్వొత్తుల ర్యాలీలు జరుగుతున్నాయి. న్యాయం కోసం నినాదాలు వినిపిస్తున్నాయి. కఠిన శిక్షల కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి. కానీ ఈ ఆగ్రహం, దుఃఖం , ఆందోళనలు, మానసిక సంఘర్షణలు అసలు మూలాన్ని వెతకడంలో అలసిపోతున్నాయి . ఇలాంటి నేరాలకు పాల్పడే వ్యక్తుల మానసిక ప్రవృత్తి ఏమిటి? అది ఒక్క క్షణపు ఉద్వేగమా? లేక వారి వ్యక్తిత్వంలోనే దాగి ఉన్న ఏదైనా చీకటా? లేదా వారి జీవితం, వారి స్వతః సిద్ధ మానసిక కోణం ఇలాంటప్పుడే బయటపడుతోందా!? ఇన్నాళ్లు మనం దానిని ఇగ్నోర్ చేశామా? ఇవే ఆ మూలాలు.. ఇలాంటి నేరాలు జరగగానే ఆ క్రూరుడిని ఒక గాటన కట్టేస్తాం "అదుపు తప్పిన కోరిక", "క్షణిక ఉద్వేగం", "ఆవేశం" వంటి అనేక పొరల మాటున అతను చేసిన గాయాన్ని మర్చిపోతున్నాం. కానీ వయసుతో సంబంధం లేకుండా, పరిస్థితుల అంశం లేశ్యమాత్రమైనా లేకుండా చిన్నారులపై, మహిళలపై, జరిగే అత్యాచారాలను, వాటి తర్వాత జరిగే హత్యలను పరిశీలించినప్పుడు ఇవన్నీ అసంపూర్ణాలు కదా!. అవును ఒకవేళ అది నిజంగానే ఒక్క క్షణపు ఉద్వేగమే అయితే, ఆ దారుణ కృత్యానికి ముందూ, వెనుకా కనిపించే పాశవిక హింస సంగతి ఏమిటి? చిన్నారి భయాన్ని చూస్తూ, చిన్నారి లేదా ఆమె అసహాయతను గమనిస్తూ, ఆ బాధను గ్రహిస్తూ కూడా తనను తాను మనిషిగా మరచిపోయి మృగత్వాన్ని కొనసాగించడం ఏ రకపు ఉద్వేగం? తన తనకాలమాన పరిస్థితులు, తన సోషల్ స్టేటస్, అందులో తాను అప్పటివరకూ పొందిన పేరు అన్నీ వదిలేసి కేవలం తన పశుత్వాన్ని మాత్రమే తాను నిరూపించుకోవడానికి సిద్ధపడటం ఏమిటి ! పోనీ నేరం జరిగిన తర్వాత అయినా తనను తాను గుర్తిస్తున్నారా? హత్యలకూ దిగుతున్నారు అదీ అత్యంత కర్కశంగా.. ఎవిడెన్స్‌ను చెరిపేయడానికి తొక్కకూడని దారులు తొక్కుతూ ఒక తప్పుకు వంద తప్పులు చేస్తూ పోతున్నారు? బయటపడతాననే భయంతో బాధితులకు ఇంకా ఇంకా నరకం చూపెడుతున్నారు. అసలిక్కడి వాస్తవం క్షణిక ఉద్వేగం కాదు. అతని లోపలి ఎన్నో రోజుల క్రూరత్వం. ఒక చిన్నారి కన్నీళ్ల కంటే తన కోరిక పెద్దదిగా కనిపిస్తోంది, ఒక చిన్నారి ప్రాణం కంటే తన రక్షణ ముఖ్యమైపోతోంది, ఎదుటివారి బాధను గుర్తించలేని నైతిక పతనం ఇది. ఒక మనిషి మరొక మనిషిని మనిషిగా చూడలేని స్థితి ఇది. సైకాలజీ దీనిని మానవత్వాన్ని హరించడంగా నిర్వచిస్తుంది. అంటే ఎదుటివారి వ్యక్తిత్వం, హక్కులు, బాధ అన్నీ అదృశ్యమై, అతను లేదా ఆమె కేవలం ఒక వస్తువుగా మారిపోవడం, తన ఆనందం, తన మానసిక వికారం తీర్చుకోవడానికి వారు ఒక ఆటబొమ్మగా వీరి దృష్టికి కనిపించడం. పోనీ ఇది క్షణకాలపు ఉద్వేగం కాదు, ఇది వారి వ్యక్తిత్వంలో భాగమే అనుకుంటే, అటువంటి వ్యక్తులను మనం ఎలా గుర్తించాలి? ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఇలాంటి నేరాలు చేసే వారు మనకేం రాక్షసుల్లా కనిపించరు. వారి ముఖాలపై క్రూరత్వం రాసి ఉండదు. వారు కుటుంబ సభ్యులుగా, బంధువులుగా, పొరుగువారిగా, సహోద్యోగులుగా, కొన్నిసార్లు సమాజంలో అత్యంత గౌరవనీయులుగా కూడా ఉంటారు."అతను అలాంటి వాడని అనుకోలేదు." అనేంత మంచివాడిగా మన మధ్య తిరుగుతూ మనతోనే జీవిస్తుంటారు. ఇదే ఇప్పటి సమాజం ఎదుర్కొంటున్న అసలైన సవాలు, ఒకానొక చీకటిని గురించిన భయం. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు. మనుషులను అర్థం చేసుకునే మన సామర్థ్యపు సమస్య, విలువల సమస్య. మనం చూసేది ఒక పబ్లిక్ ఇమేజ్‌ని మాత్రమే అయితే? మనకు కనిపించని అతని మరో ప్రపంచం!? ఆ చీకటిని ముందుగానే గుర్తించలేని మన నమ్మకం!? ఇవన్నీ ప్రశ్నలే. మనం చేస్తున్న కొవ్వొత్తుల ర్యాలీలతో మనతో నిలబడ్డ వ్యక్తుల అసలు రంగు మనం చూసేది ఎలా!? వారి అంతర్ముఖ చిత్రాలు చిత్రించేది ఎలా!? అందుకే చిన్నారులపై జరిగే లైంగిక హింసను కేవలం చట్ట పరమైన సమస్యగా చూడలేం. అది సామాజిక సమస్య. నైతిక సమస్య. మానసిక సమస్య. అంతకన్నా ముందు అది ఒక నాగరికత సంక్షోభం. ఎందుకంటే ఒక చిన్నారి ప్రపంచాన్ని మొదటిసారి విశ్వసించడం నేర్చుకుంటున్న సమయంలో, అదే ప్రపంచం ఆమెకు భయంగా మారకూడదు. ఒక మనిషిని నమ్మడం నేర్చుకుంటున్న సమయంలో, అదే మనిషి ద్వారా తను ప్రమాదంలో పడకూడదు. ఎందుకంటే ఈ నేరాలు కేవలం శరీరాలను గాయప ర చవు. అవి నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తాయి తన కుటుంబాన్ని, తన చుట్టూ ఉన్న ఏ ఒక్క మనిషినీ ఆ చిన్నారి నమ్మలేని స్థితికి తీసుకు వస్తాయి.. ఇది ఆ కుటుంబాన్ని మాత్రమే కాదు, సమాజపు సామూహిక అంతరాత్మను కూడా దెబ్బతీస్తుంది. కనీసం కొన్ని రోజుల పాటు అయినా మనిషి మనిషిని నమ్మలేని, ప్రేమించలేని స్థితిలోనికి సమాజాన్ని నెట్టివేస్తుంది.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# గ్రంథాలయాల అభివృద్ధికి రావిచెట్టు సేవలు



నిజాం రాజ్యంలో తొలి తెలుగు గ్రంథాలయం స్థాపన ఎప్పుడు ఎక్కడ జరిగిందో  చాలా మందికి తెలియదు. అప్పటి రాంకోఠిలోగల రావిచెట్టు రంగారావు బంగాళాలో స్థాపించడం జరిగింది.  నాటి వ్యవస్థాపక సమావేశానికి పాల్వంచ, భద్రాచలం సంస్థానాధిపతి రాజా పార్థసారథి అప్పారావు అధ్యక్షత వహించారు. ఆ గ్రంథాలయం తొలి అధ్యక్షుడుగా రాజానాయని వెంకట రంగారావు బహదూర్, కార్యదర్శిగా రావిచెట్టు రంగారావు ఎన్నికయ్యారు. మరునాటి నుంచే రంగారావు తెలుగు గ్రంథాలయ ఆవశ్యకతను తెలుగు ప్రజానీకానికి వివరించి చెబుతూ, మంచి గ్రంథాల సేకరణకు ఉపక్రమించారు. 1897 సంవత్సరంలో రంగారావు కొందరు మరాఠీ మిత్రుల సహకారంతో చతుర్వేదములు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణములు, కావ్యాలు, నాటకాలు, ఇతర సంస్కృత గ్రంథాలతో కూడిన 'శ్రీ శంకర భగవద్ పూజ్య పాద గీర్వాణ మంజూష' అనే గ్రంథాలయాన్ని తమ ఇంటిలోనే నిర్వహించేవాడు. తొలుత కొంతకాలం తమ బంగళాలోనే నిర్వహించబడ్డ భాషానిలయానికి రావిచెట్టు సహధర్మచారిణి లక్ష్మీనరసమ్మ సేవలను అందించేది. ఆమెనే శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయముకి అవసరమైన ఇల్లు కొనడానికి 3,000 రూపాయలు విరాళ మివ్వగా, ఆ డబ్బుతో ఇప్పుడు సుల్తాన్ బజార్ లో భాషా నిలయం భవనం ఉన్న చోటనే 1910లో ఒక పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి అందులో గ్రంథాలయం నెలకొల్పడం విశేషం.రావిచెట్టు రంగారావు (డిసెంబర్ 10, 1877 - జూలై 3, 1910) తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన ప్రముఖులు. రంగారావు 1877, డిసెంబర్ 10 న నరసింహారావు, వేంకమాంబ దంపతులకు నల్లగొండ జిల్లా, దండంపల్లి గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించారు. ఆయన వివాహం 13వ యేట లక్ష్మీ నరసమ్మతో జరిగింది.  తల్లిదండ్రుల ఆస్తిపాస్తులు మొత్తం రంగారావుకు సంక్రమించగా, తండ్రినుంచి సంక్రమించిన 'మున్సబుగిరి' స్వీకరించి 'మున్సబుదారు' అయ్యారు. తెలుగుతోపాటు హిందీ, మరాఠీ, ఇంగ్లీషు, సంస్కృతం భాషలు నేర్చుకున్నారు. తెలుగంటే వారికి వల్లమాలిన అభిమానం. మత, సాంఘిక, రాజకీయాల్లోనూ వారికి సరైన అవగాహన ఉండేది.

రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావుతో కలసి శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, పిమ్మట విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని స్థాపించారు.

సంస్కృత భాషపై  ఆయనకు ఎనలేని గౌరవం. ఒక సంస్కృత గ్రంథాలయాన్ని స్థాపించి, దాని అభివృద్ధికి తోడ్పడి "శ్రీ శంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్న మంజూష" అన్న పేరుతో సంస్కృత గ్రంథాలయాన్ని ఆ గ్రంథాలయంలో కలిపారు. అందులో చతుర్వేదాలు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, కావ్యాలు, నాటకాలు ఇత్యాది సంస్కృత ప్రబంధాలెన్నో కొనుగోలు చేసి సేకరించి పాఠకుల సౌకర్యార్థం ఉంచారు. ఆ గ్రంథాలయం తాలూకు రెండువేల రూపాయల విలువపై వచ్చే వడ్డీతో ప్రతియేట కొత్తగా వచ్చే సంస్కృత గ్రంథాలు కొనుగోలు చేసేవారు. అలా గ్రంథాలయం మొదట రంగారావు ఇంట్లోనే స్థాపించ బడింది. దాదాపు ఐదేండ్లపాటు కార్యదర్శిగా ఉన్నారు. ఎందరో దాతలవద్దకు వెళ్ళి చందాలు వసూలు చేసి, ఆరువందల రూపాయలు నిలువ చేశారు. హైదరాబాద్ లో శ్రీకృష్ణదేవరాయల పేరిట గ్రంథాలయం స్థాపించినట్టే, 1904 జనవరి 26న రాజా నాయిని వెంకటరంగారావు బహద్దూర్ సహకారంతో హనుమకొండ లో 'రాజరాజ నరేంద్ర' గ్రంథాలయాన్ని 1904 లో స్థాపించారు. ఆ గ్రంథాలయం కోసం అనేక ముద్రణాలయాలకు, గ్రంథ విక్రయ శాలలకు లేఖలు వ్రాసి అనేక గ్రంథాలు ఉచితంగా, కొన్ని సగం ధరకు, మరికొన్ని పాతికశాతం ధరకు తెప్పించి ఇచ్చారు. హనుమకొండలో బ్రిటిష్ పోస్టాఫీసు లేనందున గ్రంథాలను, పత్రికలను తమ పేరున హైదరాబాద్‌కు తెప్పించి హనుమకొండకు పంపేవారు. అంతే కాకుండా భాషా నిలయానికి స్వంత గృహవసతి కల్పించడానికి కూడా రంగారావు చాలా కృషి చేశారు. మునగాల రాజు, కొమర్రాజు లక్ష్మణరావుల సహచర్యంతో రంగారావు మద్రాసుకు తరచూ వెళ్ళేవారు. అక్కడ 1905 లో విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి స్థాపించి పుస్తక ప్రచురణలు ప్రారంభించాలని నిర్ణయించారు. ముద్రణ మద్రాసులో లక్ష్మణరావు  పర్యవేక్షణలో ఉండగా పుస్తకాలను చందాదారులకు చేర్చడం, వ్యాపార, రవాణా కార్యక్రమాలను రంగారావు హైదరాబాద్ నుండి స్వయంగా చేపట్టారు.  కుటుంబ మంతా మద్రాసుకు తరలి వెళ్లి ఆర్నెల్లపాటు అక్కడే నివసిస్తూ గ్రంథ మండలిని అభివృద్ధికి కృషి చేశారు. రావిచెట్టు స్వదేశీ ఉద్యమాన్ని బలపరిచి, స్వదేశంలో తయారైన వస్తువుల ప్రచారానికి దృఢ సంకల్పంతో పనిచేశారు. భాషా నిలయానికి పత్రికలు, కొత్త గ్రంథాలు తెప్పించినంత మాత్రాన మాతృభాషాభివృద్ధి జరుగదని భావించి, భాషా నిలయానికి అనుబంధంగా ఒక పాఠశాలను నెలకొల్పి కొత్త పద్ధతిలో చరిత్ర, భూగోళం, గణితం మొదలైనవి తెలుగులోనే బోధించాలని ఆలోచన చేశారు. దానితో పది, పన్నెండు వేలమంది విద్యార్థులతో ఒక పాఠశాల ప్రారంభించారు. కానీ సభ్యులు చేసిన వాగ్దానాలు ఆచరణకు నోచుకోలేదు. రంగారావు చొరవ తీసుకుని, చందాలకోసం తిరుగలవలసి వచ్చింది. విద్యార్థులకు పలకలు, బలపాలు, పుస్తకాలు కొనిచ్చారు. ఫలితం లేక ఆ పాఠశాల మూతపడి పోయింది. లక్ష్మీ నరసమ్మ కూడా విద్యా వికాసానికి, సాంఘిక కార్యక్రమాలతో భర్తతో పాటు పాల్గొనేవారు. స్త్రీ విద్యకై ఇద్దరూ పాటుపడ్డారు. స్త్రీలకు కుట్టు పనులు మొదలయినవి నేర్పించి వారిలో నైపుణ్యాన్ని పెంచాలనీ విద్యాభివృద్ధి చేయూత లక్ష్యంతో 'ఆంధ్రమహిళా సంఘాన్ని స్థాపించి లక్ష్మీనరసమ్మనే దాని మొదటి అధ్యక్షురాలుగా బాధ్యతల్ని చేపట్టారు. ప్రతి శుక్రవారం వారి ఇంట్లోనే స్త్రీ విద్య, శిశుపోషణ, గృహ నిర్వహణ, పాతివ్రత్యము, ఐకమత్యము మొదలయిన అంశాలపై ఉపన్యాస కార్య క్రమాలు నిర్వహించే వారు. 1908 సంవత్సరంలో మూసీనదికి భయంకరమైన వరదలు వచ్చి హైదరాబాదు నగరాన్ని ముంచి వేయగా, ఎంతో ధన, ప్రాణనష్టం జరిగింది. ఆపద కాలంలో రంగారావు హైదరాబాద్ నగర ప్రజలకు సహాయపడి, నిరాశ్రయులైన వారికి, వసతి సౌకర్యాలు కల్పించారు. వీరు ఎంతోమంది పేద విద్యార్థులను తన ఇంట్లో వుంచుకొని ఉన్నత చదువులు చెప్పించారు. అలా వారి సహాయంతో పైకివచ్చిన వారిలో ఆదిరాజు వీరభద్రరావు లాంటి వారు ఉన్నారు. రావిచెట్టు రంగారావు జీవిత చరిత్రను ఆదిరాజు వీరభద్రరావు 1910 లో 'జీవిత చరితావళి' అనే గ్రంథంలో  నిక్షిప్తం చేశారు. ఇది విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి పక్షాన 1911 లో ప్రచురితమైంది. మాతృభాష, గ్రంథాలయాల అభివృద్ధి కోసం, సర్వస్వము ధారపోసిన రంగారావు తన ముప్పై మూడో ఏటనే 1910 జూలై 3వ తేదీన ఆకస్మికంగా కన్నుమూశారు.

# ప్లాస్టిక్ నిషేధం.. ప్రకృతి పరిరక్షణకు అంకితం

ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పర్యావరణం మీద భయంకరమైన ఒత్తిడులు పెరిగి పోతున్నాయి. ఆ ఒత్తిడిలో ప్రధానంగా కనిపించే అంశం ప్లాస్టిక్ కాలుష్యం. సరుకులు కొనుగోలు చేసిన ప్రతిసారి ఒక ప్లాస్టిక్ బ్యాగ్ మన చేతిలోకి వస్తోంది. కానీ ఇది ఎంత సౌకర్యవంతమైందో అంతే ప్రమాదకరమైంది కూడా. ప్రత్యేకంగా ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ బ్యాగ్‌లు  మన జీవితాలలో సౌలభ్యంగా అనిపించినా, భూమి జీవితానికి ముప్పుగా మారాయి. ఈ అంశంపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇది కేవలం ఒక రోజుకి పరిమితమైన వేడుక కాదు. ఇది ప్లాస్టిక్ ముప్పును గుర్తించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకునే ఒక బాధ్యతాయుతమైన సంకల్పానికి సూచిక. మన సమకాలీన జీవనశైలిలో ప్లాస్టిక్ ఒక భాగమైంది. సౌలభ్యానికి ప్రతీకగా మారిన ప్లాస్టిక్ బ్యాగ్‌లు అసలు తొలిసారి 1960వ దశకంలో ప్రవేశించాయి. 1980 నాటికి ప్రపంచవ్యాప్తంగా వాటి వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. భారతదేశంలో 1990 దశకానికి తరువాత ప్లాస్టిక్ బాగ్స్ అమితంగా విస్తరించాయి. తక్కువ ధర, తక్కువ బరువు, తడిసిపోకుండా ఉండే లక్షణాలు వీటి విపరీత వినియోగానికి దారి తీశాయి. కానీ ఇవే దీర్ఘకాలంలో భూమి మీద విషపూరిత భారంగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషం దాదాపు 10 లక్షల ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడుతున్నట్టు అంచనా. వాటిలో 90 శాతం పైగా ఒక్కసారి వాడి పారేస్తున్నారు. ఈ సంచులు మానవ వినియోగంలో 12 నిమిషాలకే పరిమితమవుతాయి. కానీ ఇవి భూమిలో పూర్తిగా కలిసిపోవడానికి 400 నుంచి 500 సంవత్సరాలు పడుతుంది. సముద్రాల్లో సగటున ప్రతి చతురస్ర మైల్‌కి 46,000 ప్లాస్టిక్ తుక్కులు కనిపిస్తున్నాయి. ఒక్క సంవత్సరం వ్యవధిలోనే సముద్రాల్లో పడే ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణం 8 మిలియన్ టన్నులకుపైగా ఉండటం ఒక తీవ్ర ఆందోళనకర విషయం.

ప్లాస్టిక్ బ్యాగ్‌లు పర్యావరణాన్ని కలుషితం చేయడమే కాకుండా, జీవవైవిధ్యాన్ని ముప్పుకు గురి చేస్తున్నాయి. తాబేళ్లు, చేపలు, పక్షులు ప్లాస్టిక్ సంచులను ఆహారంగా పొగడుతూ మరణిస్తున్నారు. పశువులు పొలాల్లో మేత తింటూ ప్లాస్టిక్ తినడం వల్ల శరీరంలో అవి జీర్ణం కాకుండా పేరుకుపోతున్నాయి. మురుగునీటి వ్యవస్థల్లో సంచులు అడ్డుపడటం వల్ల నగరాల్లో వరదలు సంభవిస్తున్నాయి. ప్లాస్టిక్ తగలబడి విడుదలయ్యే డయాక్సిన్, ఫ్యూరాన్ వంటి విష వాయువులు వాయు కాలుష్యానికి దారితీస్తూ, మానవ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయి. భారతదేశంలో కూడా ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. 2016లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు రూపొందించగా, 2022 జూలై 1 నుండి ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తులపై దేశవ్యాప్తంగా నిషేధం అమలులోకి వచ్చింది. 50 మైక్రాన్ల కన్నా




తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ బ్యాగ్‌లు నిషేధిత జాబితాలో ఉన్నాయి. ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, స్ట్రాలు, స్పూన్లు, కన్ఫెక్షనరీ ప్యాకింగ్‌లు వంటి అనేక వస్తువులు ఈ నిబంధనల పరిధిలోకి వస్తున్నాయి. అయితే రాష్ట్రాల స్థాయిలో ఈ నిషేధం అమలులో అసమానతలు ఉండడం, పరిశ్రమల ఒత్తిడి, ప్రజల అలవాట్లలో మార్పు లేకపోవడం వంటి అంశాలు పెద్ద సవాళ్లుగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న పర్యావరణ. హిత మార్గాలను ప్రజలు స్వీకరించడం అత్యవసరం. బట్ట సంచులు, జ్యూట్ బ్యాగ్‌లు, తాడిపత్రి సంచులు, పేపర్ బ్యాగ్‌లు వంటి పరిష్కారాలు మానవ అవసరాలను తీరుస్తూనే ప్రకృతిని రక్షించే మార్గాల్లో మిళిత మవుతున్నాయి. అలాగే బియో డిగ్రేడబుల్ ప్లాస్టిక్‌లు, బంబూ ప్యాకింగ్ వంటి కొత్త పద్ధతులు కూడా ప్రయోగాత్మకంగా ముందుకు వస్తున్నాయి. ఈ దిశగా మార్పు రావాలంటే ప్రభుత్వ చర్యలు సరిపోవు. ప్రతి పౌరుడు తన జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు తీసుకు రావాలి. షాపింగ్‌కి వెళ్ళేటప్పుడు సొంత సంచి తీసుకెళ్లడం, ప్లాస్టిక్ తీసుకోకుండా తిరస్కరించడం, పిల్లలకు పర్యావరణ అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారాల్లో భాగస్వామ్యం కావడం వంటి చర్యలు పెద్ద మార్పుకు నాంది పలుకుతాయి. పరిస్థితిని చూసి భయపడటం కంటే, పరిష్కారాల దిశగా అడుగులు వేయడం మేలైన మార్గం. ఒక బట్ట సంచి తీసుకెళ్లడమే కాదు, అది ఒక ప్రకృతి నేస్తానికి అడ్డుగోడగా నిలవడమే. ప్లాస్టిక్‌ను వదలడం కష్టంగా అనిపించినా, భవిష్యత్తు తరాల కోసం అది అత్యవసర మార్పు. ఈ మార్పు మన చేతుల్లోనే ఉంది. మన భూమి మన చేతుల్లో ఉంది. దానిని రక్షించడంలో ప్రతి చిన్న చర్యకూ విలువ ఉంది. ప్లాస్టిక్ బ్యాగ్‌ను తిరస్కరించడం అంటే భూమిని అంగీకరించడం. మానవతా దృష్టితో భావించి, ప్రకృతిని పరిరక్షించేదే నిజమైన పర్యావరణ భక్తి. ప్లాస్టిక్ బ్యాగ్ రహిత జీవితం ఒక సవాలుగా కనిపించినా, అది సాధ్యమే. దీని వల్ల మనకు కేవలం పర్యావరణ పరిరక్షణే కాక, భవిష్యత్తు తరాలకు ఒక ఆరోగ్యవంతమైన ప్రపంచాన్ని అందించ గలుగుతాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని ఒక నాటి కార్యక్రమంగా కాకుండా, రోజువారీ జీవితంలో ఒక అలవాటుగా మలచుకోవాలి. ఒక్కొక్కరి చర్య ఒక విశ్వ విప్లవానికి నాంది కావచ్చు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు పర్యావరణాన్ని కలుషితం చేయడమే కాకుండా, జీవవైవిధ్యాన్ని ముప్పుకు గురి చేస్తున్నాయి. తాబేళ్లు, చేపలు, పక్షులు ప్లాస్టిక్ సంచులను ఆహారంగా పొగడుతూ మరణిస్తున్నారు. పశువులు పొలాల్లో మేత తింటూ ప్లాస్టిక్ తినడం వల్ల శరీరంలో అవి జీర్ణం కాకుండా పేరుకుపోతున్నాయి.

# ఆత్మకు పరమాత్మతో ఉండే పవిత్ర బంధమే రక్షా బంధన్

**-బ్రహ్మకుమారీ ఆధ్వర్యంలో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు -పీసీసీ అధ్యక్షుడికి రాఖీ కట్టిన సునీత బహేన్ జీ**



**నిజామాబాద్ సిటీ , ఆగష్టు 27 ( ప్రజాగళం )**రక్షా బంధన్ అనేది కేవలం సోదర సోదరీమణుల బంధం కాదని, ఆత్మకు పరమాత్మతో ఉండే పవిత్ర బంధమని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నాందేవ్ వాడ కేంద్రం నిర్వాహకురాలు సునీత బహేన్ జీ అన్నారు. గురువారం బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నాందేవ్ వాడ కేంద్రం ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిజామాబాద్ లో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు కే నగేష్ రెడ్డి, డీసీసీ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ లకు సునీత బహేన్ జీ పవిత్ర దారాన్ని(రాఖీలు) కట్టి మిఠాయిలు అంధించి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సునీత బహేన్ జీ మాట్లాడుతూ రక్షబంధన్ వేడుకలు పవిత్రతా బంధానికి ప్రతీక అన్నారు. బురదలో ఉన్న చెడు అలవాట్ల నుంచి తనను తాను రక్షింకోవటం, ఇతరులను రక్షించడం అనే ప్రతిజ్ఞ ఈ రాఖీ పండగ సారాంశమన్నారు. అన్న తమ్ముడు అక్క, చెల్లెలను రక్షించాలనేటటువంటి నానుడి మనదేశంలో ఎన్నో సంవత్సరాల నుంచి వస్తుంది. కాబట్టి అన్న తమ్ముడు అక్కకు చెల్లికి మాత్రమే రక్షణ కాకుండా దేశంలో ఉన్న ప్రతి మహిళా మూర్తులను రక్షిస్తూ వసుదేవ కుటుంబకంగా వారిని వికారి దృష్టితో చూడకుండా, ఒక ప్రేమ దృష్టితో చూస్తూ ముందుకు వెళ్తే ఈ భారతదేశం సుసంపన్నంగా స్వర్గంగా తయారు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జీవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ లో ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై వార్డు సభ

**బోధన్ ప్రతినిధి,ఆగస్టు 27: (ప్రజా గళం)**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్--స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా గురువారం బోధన్ పట్టణంలో 35,36వ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు.షర్బత్ కెనాల్ ప్రాంతంలోని పాషాభాయ్ ఇంటి వద్ద జరిగిన ఈ సమావేశంలో ఓటరు జాబితా సవరణ,కొత్త ఓటర్ల నమోదు,ఓటర్ల వివరాల పరిశీలన తదితర అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పద్మ శరత్ రెడ్డి,కౌన్సిలర్ సభా బేగం జావిద్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి,అర్షద్ పాషా,కౌన్సిలర్ మహమ్మద్ జహీర్,డబ్బు,కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు పలువురు ఓటర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని,ఏవైనా తప్పులు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవాలని,అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఓటరు జాబితా ఖచ్చితత్వం కోసం ప్రభుత్వం చేపడు తున్న ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలు సహక రించాలని నాయకులు కోరారు.







# జిల్లా ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు

**- సోదర భావానికి ప్రతీక గా నిలిచిన పండగ**

**- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**





**నిజామాబాద్, ఆగస్టు 27 ( ప్రజాగళం ప్రతినిధి)** సోదర భావానికి ప్రతీక అయిన రక్షా బంధన్ (రాఖీ పండుగ) పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ రాఖీ పండగను సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసాను అందించడం ఈ పండుగ విశిష్టత అని గుర్తు చేశారు."రాఖీ" కుటుంబ బంధాలను బలోపేతం చేసే వారధి అని అన్నారు. మహిళలకు భద్రత, గౌరవం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని, కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని, ప్రేమానురాగాలను చాటే ఈ పర్వదినం మన సంస్కృతి, ఔన్నత్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. సోదరభావంతో, ప్రేమానురాగాలతో ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి నాడు రాఖీలు కట్టుకుంటూ జరుపుకునే ఈ వేడుక భారతీయ సాంప్రదాయాల గొప్పదనాన్ని యావత్ ప్రపంచానికి చాటుతుందన్నారు. రాఖీ పౌర్ణమి వేడుక ప్రజల మధ్య ఆత్మీయతను మరింతగా పెంపొందించాలని వారు ఆకాంక్షించారు.

# బెంగళూరులోని క్వారీలో కార్మికులపై బండరాయి పడి ఏడుగురు మృతి



**బెంగళూరు :** బెంగళూరు శివార్లలోని మడపట్టణ గ్రామంలో ఉన్న ఒక రాతి క్వారీలో, మంగళవారం ఉదయం నలిగిన రాళ్లను లోడ్ చేస్తున్న ట్రాక్టర్ పై పెద్ద బండరాయి పడటంతో ఏడుగురు కార్మికులు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. బెంగళూరు దక్షిణ తాలూకాలోని ఒక స్టోన్ క్రషర్ యూనిట్‌లో ఈరోజు ఉదయం సుమారు 7:30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. కార్మికులు వారి పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ క్వారీలో సుమారు 20 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో బీహార్, కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాకు చెందిన వలస కార్మికులే పని చేస్తున్నారు. వారు పనిచేస్తున్న సమయంలో 40 అడుగుల ఎత్తుకంటే పైనుండి ఓ పెద్ద బండరాయి వారిపై పడింది. ఈ సమయంలో తమిళనాడుకి చెందిన గోపి అనే కార్మికుడు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. కొంతమంది కార్మికులు ఆ పెద్ద బండరాయిని అక్కడి నుంచి కదిలించి వేరు చేయడానికి ప్రయత్నించే సమయంలో ఒక్కసారిగా దొర్లుకుంటూ జారి కింద పడిపోయింది. పైనున్న కార్మికులు ఆ పెద్ద బండరాయిని కదిలిస్తున్నట్లు తమకు ముందే చెబితే.. ఇంత ప్రాణ నష్టం జరిగి ఉండేది కాదని గోపి విలేకరులకు చెప్పాడు. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని చికిత్స కోసం రాజరాజేశ్వరి ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం.. ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలను వెలికి తీసేందుకు రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. సమాచారం అందిన వెంటనే తావరెకెరె పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంకా చాలామంది గల్లంతయ్యారని.. బహుశా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ క్వారీ ఆనందస్వామి అనే వ్యక్తికి చెందినది. ఈ ఘటనలో మృతి చెందినవారు అక్కడే ఏడాదికి పైగా కూలీలుగా పనిచేస్తున్నారు. వారు క్రషర్ యూనిట్ సమీపంలోని తాత్కాలిక నివాసంలో ఉంటున్నట్లు సమాచారం. ఈ ప్రమాదం జరిగిన వెంటనే క్వారీ యజమానిని విచారించడానికి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జిల్లాలో టేస్టీరా సేవలు ప్రారంభం




**నిజామాబాద్ సిటీ , ఆగష్టు 25 ( ప్రజాగళం )**స్విగ్గి,జుమోటో తరహాలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సరికొత్తగా టేస్టీరా సేవలు అందుబాటులోకీ వచ్చాయి.. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్ లో లాంఛనంగా ప్రారంభించారు. ఐటీ హబ్ జోనల్ మేనేజర్ శివ ప్రసాద్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర సంస్థలతో పోటీపడుతూ నాణ్యమైన సేవలను అందిస్తూ పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. టేస్టీరా సీఈఓ శ్యామ్ ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని సంస్థను ప్రారంభించారని అతడి కష్టానికి ప్రతిఫలం లభించేలా సంస్థను ఉన్నత స్థితికి తీసుకువెళ్లాలని సిబ్బందికి సూచించారు.టేస్టీరా సీఈఓ మగ్గిడి శ్యామ్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా జిల్లాలో టేస్టీరా సేవలను అందుబాటులోకి తీసుకుచ్చేందుకు ఎన్నో కసరత్తులు చేసి చివరగా ఈ రోజు మా స్వప్నం సకారం చేసుకున్నామన్నారు. టేస్టీరా అంటే అమూల్యమైన సేవలకు ప్రత్యేకంగా నిలుపుతామన్నారు. జిల్లాలోని మధ్యతరగతి ప్రజలు తమ సేవలను ఆస్వాదిస్తూ మా టేస్టీరా యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాణ్యమైన సేవలను అందిస్తూ రానున్న రోజులలో తమ సేవలను రాష్ట్ర స్థాయిలో విస్తారిస్తామని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఐటీ హబ్ డిప్యూటీ జోనల్ మేనేజర్ బహుగుణ తెలంగాణ రాష్ట్ర ఐపిసి అధ్యక్షులు ఫాస్టర్ ఎం. అహరోను,మేనేజర్ అమన్,మగ్గిడి విజయ్, మగ్గిడి సవిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

# 27 నిమిషాల్లోనే రూ.2.82 లక్షల కోట్లు లాభం...!



దేశీయ స్టాక్ మార్కెట్లలో బుల్ రన్ కొనసాగుతోంది. జూలై నెల ప్రారంభం నుంచి మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ లాభాలతో దూసుకుపోతున్నాయి. గురువారం ట్రేడింగ్ ప్రారంభమైన కేవలం 27 నిమిషాల్లోనే ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ.2.82 లక్షల కోట్లు పెరిగింది. బుధవారం నాటి లాభాలను కూడా కలిపితే.. గడిచిన రెండు రోజుల్లోనే ఇన్వెస్టర్లకు రూ.5 లక్షల కోట్లకు పైగా రికవరీ లభించడం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పరిణామాలు భారత మార్కెట్లకు ఊతాన్నిచ్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా నాలుగు కారణాలు మార్కెట్ ర్యాలీకి కారణమయ్యాయని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 1% తగ్గి, బ్యారెల్‌కు 70.79 డాలర్ల వద్దకు పడిపోయింది. అమెరికా ? ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చల్లో సానుకూల పురోగతి ఉండటంతో ఆయిల్ ధరలు దిగొచ్చాయి. జూన్ నెలలో దేశీయ ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 25% పెరిగి దాదాపు 4 లక్షల యూనిట్లకు చేరడం ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌కు అద్దం పట్టింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఈఎఎ) అమ్మకాల ఒత్తిడి తగ్గడం కూడా మార్కెట్‌కు కలిసొచ్చింది. దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఏఐ (ంఎ) ఆధారిత ట్రేడింగ్ బలహీనపడటం, భారతదేశం లాంటి నాన్-ంఎ మార్కెట్లకు అనుకూలంగా మారింది. గురువారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలోనే 30 షేర్ల బీఎస్ఈ (ఖాఇ) సెన్సెక్స్ 526.61 పాయింట్లు పెరిగి 77,449.25 వద్దకు చేరింది. అటు 50 షేర్ల ఎన్ఎస్ఈ (ఔాఇ) నిఫ్టీ కూడా 153.6 పాయింట్ల లాభంతో 24,159.45 వద్ద ట్రేడ్ అయింది.

# గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన తీజ్ పండుగ

**- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిజామాబాద్ ఆగస్టు 27 (ప్రజాగళ ప్రతినిధి )**కమ్మర్‌పల్లి మండలం





కేసీ తండా గ్రామపంచాయతీ, వాసన్‌గట్టు తండాలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.ఆయా తండాలలో జగదాంబ మాయి, సేవాలాల్ మహారాజ్‌లను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గిరిజన సోదర, సోదరీమణులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొని వారిని ఆత్మీయంగా పలకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తీజ్ పండుగ గిరిజన, బంజారా సమాజానికి ఎంతో ప్రత్యేకమైన పండుగ అని అన్నారు.గిరిజన సమాజం ఐక్యత, సంప్రదాయాలు, సంస్కృతికి తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలను తరతరాలకు కొనసాగిస్తూ భావితరాలకు అందించడం అభినందనీయవన్నారు.బంజారా సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగిన సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అకాక్షించారు.ఈ సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులందరికీ తీజ్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజన పెద్దలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్నేహ సొసైటీలో ఘనంగా రాఖీ పండుగ



**నిజామాబాద్ ఆగస్టు 27: ( ప్రజా గళం ప్రతినిధి)** సోదర భావం ఉట్టిపడే విధంగా స్నేహ సొసైటీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా రాఖీ పండుగను గురువారం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ లొ రాఖీ పండగ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య , కేదాసి మోహన్ రాష్ట అధ్యక్షులు ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన మల్ల మరి సుధాకర్ ఆధ్వర్యంలో స్నేహ సొసైటీ లో విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మల్లమారి సుధాకర్ మాట్లాడుతూ సోదర, సోదరీమణుల ఆప్యాయత కలయికల ఆత్మీయ బంధానికి ఈ రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఆయన అన్నారు. స్నేహ సొసైటీలో దివ్యాంగులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. తొలిసారిగా దివ్యాంగుల మధ్య రాఖీ పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ రాఖీ పండుగ కార్యక్రమానికి 17వ డివిజన్ కార్పొరేటర్ మమత శివ ముఖ్య అధితిధిగా హాజరై పిల్లలకు రాఖి కట్టి,హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్యా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సిలుమల పోసాని జిల్లా అధ్యక్షురాలు వసంత భాగ్య దేవేందర్,ఇందిరా గిరిబాబు, మోహన్, రాహుల్, స్నేహ సొసైటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యనగరంలో 20 వేల మంది అక్రమవలసదారులా...




**హైదరాబాద్, జూలై 2 :** కేంద్ర ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణలో అక్రమ వలసదారులపై నిఘా సంస్థలు జరిపిన విచారణలో విస్తుబోయే నిజాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్ నగరంలోనే దాదాపు 21,563 మంది అక్రమ వలసదారులు ఉన్నట్లు తేలింది. వీరిలో 9,500 మంది రోహింగ్యాలు, 4 వేల మంది బంగ్లాదేశీయులు, 1,400 మంది ఆఫ్రికన్ జాతీయులు ఉన్నారు. తక్కువ జీవన వ్యయం, ఎక్కువ ఉపాధి అవకాశాల వల్ల వీరంతా హైదరాబాద్ బాట పట్టారు. ఈ నేపథ్యంలో రోహింగ్యాల నివాసం జాతీయ భద్రతకు తీవ్ర ఆందోళనకరమని నకిలీ గుర్తింపు పత్రాలు రద్దు చేయాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశంలోకి చొరబడుతున్న అక్రమ వలసదారుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో.. తెలంగాణ నిఘా వర్గాలు క్షేత్రస్థాయిలో జరిపిన దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పొరుగు దేశాల నుంచి అక్రమ మార్గాల్లో సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి ప్రవేశించిన విదేశీయుల సంఖ్య వేలల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# డిమాండ్ల సాధన కోసం ఉద్యమించిన ఉద్యోగులు

## -ధర్నా చౌక్ లో మహాధర్నా -భారీగా తరలివచ్చిన ఉద్యోగులు

**నిజామాబాద్, ఆగష్టు 27( ప్రజాగళం ప్రతినిధి )** గత కొంతకాలంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఉద్యమం చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో మహాధర్నా కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ మహాధర్నా కు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలివచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ చైర్మన్ నాశెట్టి సుమన్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన స్పందించడం లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో ఉద్యోగుల పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగులకు అడుగడుగున అన్యాయం జరుగుతుందని నాశెట్టి సుమన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పట్ల గత ప్రభుత్వ విధానాలను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని దీంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈ హెచ్ ఎస్) అమలులో అధికారుల అలసత్వం, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసుకోని 2వ పే రివిజన్ కమిటీ నివేదిక అమలు, 6 పెండింగ్ డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఒపీఎస్ అమలు, ఈహెచ్ఎస్ ను పటిష్టంగా అమలు చేయాలని టీజీఈ–జేఏసీ డిమాండ్ చేస్తుందాన్నారు. నిజామాబాద్ జిల్లా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాద్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన మహాధర్నా లో తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ లు పాల్గొన్నయన్నారు.ముఖ్యమంత్రి ఇచ్చిన మూడు హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని ప్రధానంగా క్రింది మూడు కీలక అంశాల పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు, ఆరోగ్య కార్డుల వినియోగం, చికిత్స అందుబాటు, ఎంపానెల్ చేసిన ఆసుపత్రుల్లో సేవలు, వైద్య బిల్లుల పరిష్కారం తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు పెన్షనర్స్ వర్కర్స్ తదితరులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 2వ పే రివిజన్ కమిటీ (రెండవ పి ఆర్ సి) నివేదికను ప్రభుత్వం వెంటనే ప్రకటించి, ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలన్నారు.జూన్ 2 లోపు పి ఆర్ సి నివేదికను కమిటీ నుండి తెప్పించుకొంటామనే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు.అదేవిధంగా ఉద్యోగులకు రావాల్సిన ఆరు (6) వాయిదాల పెండింగ్ డీఏలను (డీర్నెస్ అలవెన్సుస్ ) వెంటనే మంజూరు చేసి, ఒకేసారి విడుదల చేసి చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు..గత పిఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు పూర్తి అయినందున 2 పి ఆర్ సి నివేదికను తక్షణమే అమలు చేయడంతో పాటు, 6 పెండింగ్ డీఏలను కూడా ఎటువంటి అలస్యం లేకుండా విడుదల చేయాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని జిల్లా ఉద్యోగ జేఏసీ కోరుతోందన్నారు.ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి ఆర్థిక భద్రత కల్పించే విషయంలో పెన్షన్ విధానం అత్యంత కీలకమైన జిల్లా ఉద్యోగ జేఏసీ పేర్కొంది.ప్రస్తుతం అమల్లో ఉన్న కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్ )ను రద్దు చేసి, ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ (ఒ పి ఎస్ )ను పునరుద్ధరించాలన్నారు.ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.డిమాండ్ల నిమిత్తం ప్రభుత్వం ముందుకు వచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరుతోందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అధికారులు అమలు పరచక పోవడాన్ని టీజీఈ జేఏసీ నిజామాబాద్ జిల్లా పక్షాన తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. 2వ పి ఆర్ సి నివేదికను వెంటనే ప్రకటించి అమలు చేయాలన్నారు.ఉద్యోగుల పెండింగ్ బిల్స్ కొరకు ప్రభుత్వం చెల్లిస్తున్న 2000 కోట్లు యదావిధిగా ఈ నెల నుండి కొనసాగించాలన్నారు.'విద్యాశాఖ రేషనలైజేషన్ జి .ఒ 25 ను సవరించాలన్నారు.విద్యా శాఖ ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొంది ంచాలన్నారు.ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలన్నారు.317 జి .ఒ బాధితులకు న్యాయం చేయాల న్నారు.రాష్ట్ర ప్రభుత్వం మేనిఫేస్టో లో పెట్టిన విధంగా, అంగన్వాడీ ఉద్యోగుల జీత భత్యాలు పెంచాలన్నారు.తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో టీ జి ఈ –జేఏసీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ రోజు నుంచి పీఆర్సీ నివేదిక విడుదలయ్యే వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు అవుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు.టీజీఈజేఏసీ జిల్లా కమిటి యూనిట్, మండలాలు పర్యటన సన్నహక సదస్సులు.సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భముగా ఐ డి ఒ సి కార్యలయ ఆవరణలో నిరసన తెలుపుతామన్నారు.సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో మహా ధర్నా చెపడతామన్నారు.ఈ మహా ధర్నాలో ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు.




# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలి

### - సాంఘిక బహిష్కరణ ఘటనలపై కఠినంగా వ్యవహరించాలి - విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్





**నిజామాబాద్, ఆగష్టు 27 ( ప్రజా గళం ప్రతినిధి )** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతి పై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా పకడ్బందీగా దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో చార్జ్ షీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇతర సహాయ సహకారాల విషయంలో ఎలాంటి జాప్యం జరుగకుండా చూడాలన్నారు. కేసుల సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ, తదితర శాఖల కార్యాలయాల ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన నివేదికలను, లేఖలను అందజేయాలని సూచించారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూడాలని సూచించారు. ప్రతి నెల సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని, దళిత, గిరిజన వర్గాల ప్రజల హక్కులపై వారికి అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జీవనాధారం కోసం ప్రభుత్వం అందజేసిన అసైన్డ్ భూములను ఎవరైనా కబ్జా చేసినట్లైతే తమ దృష్టికి తేవాలని, బాధితులకు భూభారతి చట్టం ద్వారా న్యాయం జరిగేలా కృషి చేస్తామని కలెక్టర్ సూచించారు. కాగా, గ్రామాలలో సాంఘిక బహిష్కరణలు వంటి సంఘటనలు జరిగినప్పుడు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి రజిత, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు ప్రకాష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 10 వ తేదీన వచ్చే శనివారం అమావాస్య సం దర్భంగా....

### - పూజ సామాగ్రి విక్రయ దుకాణా సముదాయాల నిర్వహణకు వేలంపాట.....



**ఎడపల్లి,ఆగస్టు 27:** (ప్రజా గళం)ఎడపల్లి మండలం జానకంపేట శ్రీ లక్ష్మీనరసింహా స్వా మి ఆలయంలో లడ్డు పులిహోర,కొబ్బరి కాయ,నవధా న్యాలు అమ్ముకొనుటకు,సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో,దేవాదాయ ధర్మా య శాఖ అధికారులు వేలం పాట నిర్వహించారు.వచ్చే అక్టోబర్ 10 వ తేదీన శనివారం అమావాస్య వస్తున్నందున,భక్తుల కోసం,పూజ సామాగ్రి,లడ్డు పులిహోర,కొబ్బరికాయ నవధాన్యాలు, సైకిల్ స్టాండ్ కు వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వా హణాధికారి గింజుపల్లి వేణు తెలిపారు.లడ్డు,పులి హోర విక్రయించుకునేందుకు నిజామాబాద్ కు చెందిన జి.సురేష్ అనే వ్యాపారి వేలం పాటలో పాల్గొని 47 వేల రూపాయలకు దక్కించుకున్నారని,అలాగే కొబ్బరికా య,నవధాన్యాలు విక్రయించుకునేందుకు జాన్కంపేట్ గ్రామానికి చెందిన ఏ.సిద్దు అనే వ్యాపారి వేలంపాట పాల్గొని 55 వేల రూపాయలకు దక్కించుచకోగా,సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు జాన్కంపేట్ కు చెందిన సుమన్ 10 వేల రూపాయలకు వేలం పాటలో దక్కించుకున్నారని ఈవో వేణు తెలిపారు.వచ్చే శనివారం అమావాస్య రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పవిత్ర అష్ట ముఖి కోనేటిలో స్నానమాచరించి శ్రీ లక్ష్మినరసింహా స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి కృపాకు పాత్రులు కావాలని భక్తులను అయన కోరారు. ఆలయ చైర్మన్ చిలుక రవికుమార్ మాట్లాడుతూ..వచ్చే అక్టోబ ర్ 10 న వచ్చే శనివారం అమావాస్య సందర్భంగా ఈ రోజున పూజ సామాగ్రి విక్రయానికి వేలం పాట నిర్వహించడం జరిగింది అని తెలిపారు.శనివారం అమావా స్య కోసం భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ తరపున, దేవాదాయ ధర్మదాయ శాఖ తరపున అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని అన్నారు.ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో దక్షిణ భారత దేశంలోనే రెండవ పవిత్ర అష్టముఖి (పుష్కరిణి)కొనేరు వెలసియుందని,ఈ కోనేరులో స్నా నాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని మొక్కు లు చెల్లించుకుంటే కోరిన వారికి కొంగు బంగారమై, అష్టఐశ్వర్యలు సిద్దిస్తాయని భక్తులు విశ్వసిస్తారని అన్నారు.ఈ సందర్భంగా అమావాస్య శనివారం రోజున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని స్వామి కృపాకు పాత్రులు కావా లని చైర్మన్ చిలుక రవికుమార్ కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఎండోమెంట్ ఇన్స్ స్పెక్టర్ సుజాత రెడ్డి, ఆలయ డైరెక్టర్ లు,జింక లక్ష్మి లింగం,గ్రామ పెద్దలు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి

### - కలెక్టర్ భవేష్ మిశ్రా హితవు
### - ఓటర్లకు నోటీసులు అందజేస్తున్న విధానం పరిశీలన



నిజామాబాద్, ఆగస్టు 27 ( ప్రజాగళం ప్రతినిధి ) అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగని వారికి, పేరు, వయసు వంటి అంశాలలో వ్యత్యాసం కలిగి ఉన్న ఓటర్లకు హియరింగ్ కు రావాలని కోరుతూ బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్ పరిధిలో గల కంఠేశ్వర్ లో సిబ్బంది ఇంటింటికి తిరిగి నోటీసులు అందిస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలన జరిపారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బీ.ఎల్.ఓ, సూపర్వైజర్లు అందుబాటులో ఉన్నారా లేదా అన్నది గమనించారు. వారు విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమందికి నోటీసులు అందించారు, ఇంకా ఎంత మందికి ఇవ్వాల్సి ఉన్నది, పోలింగ్ కేంద్రం పరిధిలో మ్యాపింగ్ జరగని ఓటర్లు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధృవీకరణ అవసరం ఉన్న ఓటర్ల ఇంటింటి స్వయంగా వెళ్లి నోటీసులు అందించాలని, సూచించిన సమయానికి ఒకవేళ వారు రాలేకపోతే మరోమారు నోటీసు ఇవ్వాలని సూచించారు. నోటీసు అందించే సమయంలోనే ఎవరైనా ఓటర్లు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని స్వీకరించవచ్చని అన్నారు. నిర్ణీత గడువులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీ.ఎల్.ఓ సూపరింటెండెంట్ మురళి, బీ.ఎల్.ఓ లావణ్య తదితరులు ఉన్నారు.

# అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి


### - కలెక్టర్ భవేష్ మిశ్రా హితవు.
### - ఓటర్లకు నోటీసులు అందజేస్తున్న విధానం పరిశీలన

**నిజామాబాద్, ఆగష్టు 27 ( ప్రజాగళం ప్రతినిధి )** అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగని వారికి, పేరు, వయసు వంటి అంశాలలో వ్యత్యాసం కలిగి ఉన్న ఓటర్లకు హియరింగ్ కు రావాలని కోరుతూ బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్ పరిధిలో గల కంఠేశ్వర్ లో సిబ్బంది ఇంటింటికి తిరిగి నోటీసులు అందిస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలన జరిపారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బీ.ఎల్.ఓ, సూపర్వైజర్లు అందుబాటులో ఉన్నారా లేదా అన్నది గమనించారు. వారు విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి, ఇప్పటివరకు ఎంతమందికి నోటీసులు అందించారు, ఇంకా ఎంత మందికి ఇవ్వాల్సి ఉన్నది, పోలింగ్ కేంద్రం పరిధిలో మ్యాపింగ్ జరగని ఓటర్లు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధృవీకరణ అవసరం ఉన్న ఓటర్ల ఇంటింటి స్వయంగా వెళ్లి నోటీసులు అందించాలని, సూచించిన సమయానికి ఒకవేళ వారు రాలేకపోతే మరోమారు నోటీసు ఇవ్వాలని సూచించారు. నోటీసు అందించే సమయంలోనే ఎవరైనా ఓటర్లు ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని స్వీకరించవచ్చని అన్నారు. నిర్ణీత గడువులోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బీ.ఎల్.ఓ సూపరింటెండెంట్ మురళి, బీ.ఎల్.ఓ లావణ్య తదితరులు ఉన్నారు.



# మేయర్ ఉమారాణిని పరామర్శించిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాద్ సిటీ ఆగస్టు 27(ప్రజాగళం)**నిజామాబాద్ నగరంలోని కసాబ్ గల్లీ లో నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణిని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గురువారం పరామర్శించారు.ఇటీవల మేయర్ కూరగాయల ఉమారాణి మాతృమూర్తి పరమపదించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం కసాబ్ గల్లీలోని మేయర్ నివాసానికి వెళ్లిన మహేష్ కుమార్ గౌడ్ , వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాతృమూర్తి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. మహేష్ కుమార్ గౌడ్ తో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



# పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

**నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 27 ( ప్రజా గళం )**రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్, ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన బ్రహ్మకుమారీలు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు రాఖీ కట్టి , రక్షాబంధన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతి , భద్రత, సోదరభావం , మానవతా విలువలను పెంపొందించడంలో పోలీస్ శాఖ చేస్తున్న సేవలను వారు అభినందించారు. రాఖీ పండుగ సోదర––సోదరీమణుల మధ్య ప్రేమ , ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీక అని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు సోదరభావంతో , శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు పోలీస్ కమిషనర్ కు రాఖీ కట్టి , ఆశీస్సులు అందించారు. సీపీ కి రాఖీ కట్టిన వారిలో బ్రహ్మ కుమారి లు వనజ , శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com